ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	588.60 (307.8742)	2,57,303	1,51,072
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	641.70 (3.62)	731.24	394.74
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	166.89 (34.10)	1,01,555	64,889

చికెన్ ధరలు	లైవ్ : రూ.102	డ్రెస్ : రూ.150	స్కిన్‌లెస్ : రూ.170

డిండి ఎత్తిపోతల, శ్రీశైలం సొరంగమార్గం, ఇతర ప్రాజెక్టులను పూర్తిచేసి జిల్లా ప్రజలకు సాగునీరు అందిస్తామని రాష్ట్ర భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం డిండి మండల కేంద్రంలో, అడవిదేవులపల్లి మండలంలోని చిట్యాల వద్ద నిర్మిస్తున్న దున్నపోతులగండి ఎత్తిపోతల పథకం వద్ద సాగునీటిశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు.

- దేవరకొండ/డిండి, దామరచర్ల



డిండిలో సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్

ఎత్తిపోతల పథకాలు పూర్తిచేసి

సాగునీరు అందిస్తాం

» నిర్వాసితులకు పునరావాసం, పూర్తిస్థాయిలో పరిహారం ఇస్తాం » నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్

డిండిలో దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాల ప్రాజెక్టులపై నిర్వహించిన సమీక్షలో దేవరకొండ, మునుగోడు ఎమ్మెల్యేలు నేనావత్ బాలునాయక్, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. ఎన్ని డబ్బులైనా ఖర్చుచేసి శ్రీశైలం సొరంగమార్గాన్ని పూర్తి చేస్తామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం శ్రీశైలం సొరంగమార్గం, డిండి ఎత్తిపోతల ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసిందన్నారు. దేవరకొండ నియోజకవర్గానికి, తనకు ఆత్మీయ అనుబంధం ఉందని, ప్రాజెక్టులను పూర్తిచేసి సాగునీరు అందించి ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు. డిండి ఎత్తిపోతల రిజర్వాయర్, శ్రీశైలం సొరంగమార్గం, నక్కలగండి రిజర్వాయర్ పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూనిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం, పునరావాసం కల్పిస్తామన్నారు. మానవతా దృక్పథంతో భూసేకరణ జరగాలని, అందుకు నిర్వాసితులు కూడా సహకరించాలన్నారు. రాష్ట్రంలో ఏటా ఆరు లక్షల ఎకరాలకు నూతనంగా సాగునీరు అందిస్తామన్నారు. ప్రాజెక్టుల పనులపై ఈ నెల 16న నీటిపారుదలశాఖ కార్యదర్శి ప్రశాంత్ జీవన్‌పాటిల్, నీటిపారుదలశాఖ అధికారులు కాంట్రాక్టర్లతో సమావేశమై పనులు ముందుకు సాగేలా చర్చించి సమస్యలను పరిష్కరించాలన్నారు. సమావేశంలో నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ అనిల్ కుమార్, కార్యదర్శి ప్రశాంత్‌జీవన్‌పాటిల్, కలెక్టర్ నారాయణరెడ్డి, సీఈ నాగేశ్వర్‌రావు, ఆర్డీవో శ్రీరాములు, ఎస్ఈలు వెంకటేశ్వరరావు, శ్రీనివాస్‌రెడ్డి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్, పాల్గొన్నారు.

డిండి ఎత్తిపోతల పూర్తిచేయాలి

- ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

డిండి ఎత్తిపోతల పూర్తిచేసి మునుగోడు నియోజకవర్గంలో ఫ్లోరైడ్ సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి కోరారు. ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తే జన్మజన్మలకు మునుగోడు ప్రజలు రుణపడి ఉంటారన్నారు. కిష్టరాయన్‌పల్లి, చర్లగూడెం రిజర్వాయర్లతో భూములు కోల్పోయిన నిర్వాసితులకు 2018లో రూ.4లక్షల నుంచి రూ.5లక్షల వర కే పరిహారం ఇచ్చారన్నారు. ప్రాజెక్టులో భూములు కోల్పోయిన వారిని ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీని ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో కేటాయించి పునరావాసం కల్పించాలన్నారు.



నీటిపారుదలశాఖ మంత్రిగా ఉత్తమ్ ఉండడం అదృష్టం

- ఎమ్మెల్యే బాలునాయక్



ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నీటిపారుదలశాఖ మంత్రిగా ఉండడం ఈ ప్రాంతానికి అదృష్టమని, డిండి ఎత్తిపోతల సొరంగమార్గం, పెండ్లిపాకల ప్రాజెక్టులతో పాటు, ఎత్తిపోతల రిజర్వాయర్‌లకు పెండింగ్ బిల్లులు చెల్లించి నిధులు కేటాయించాలని దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ కోరారు. పెండ్లిపాకల భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని, కాంట్రాక్టర్‌ను తొలగించి మళ్లీ రీటెండర్ పిలవాలన్నారు. ఏఎమ్మార్పీ మెయిన్ కెనాల్‌కు లైనింగ్ చేపట్టాలని, పుట్టంగండి రోడ్డుకు సైడ్‌వాల్ నిర్మించాలని కోరారు. నాగార్జునసాగర్ బ్యాక్ వాటర్ నుంచి కాచరాజుపల్లికి గాజుబేడం లిఫ్టు, డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి చిత్రియాల లిఫ్టు, మొండికట్టల చెరువు, పేర్వాల నుంచి నేరేడుగొమ్ముకు రామనేనితండా లిఫ్టు మంజూరు చేయాలని కోరారు. కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా డిండి ప్రాజెక్టును నింపాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారు.

టీబీఎం యంత్రానికి 50శాతం అడ్వాన్స్ చెల్లించాలి

- జేపీ కంపెనీ ప్రతినిధి అనిల్‌కామత్

శ్రీశైలం సొరంగమార్గం తవ్వకానికి ఉపయోగించే టన్నెల్ బోరింగ్ యంత్రానికి (టీబీఎం) 50శాతం నిధులు అడ్వాన్స్‌గా కేటాయించాలని జేపీ కంపెనీ ప్రతినిధి అనిల్‌కామత్ మంత్రిని కోరారు. సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం చేసిన పనులకు బిల్లులు చెల్లిస్తోందని, జర్మని, అమెరికా దేశాల నుంచి టీబీఎం పరికరాలు రప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. యంత్రం విడిభాగాలు రాగానే పనులు తిరిగి ప్రారంభిస్తామన్నారు.

ఏడాదిలో పనులు పూర్తి చేస్తాం..

వచ్చే ఏడాది ఆగస్టు 15లోగా మిర్యాలగూడ నియోజకవర్గంలోని ఐదు ఎత్తిపోతల పథకాల పనులను పూర్తి చేసి సాగునీరందిస్తామని మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. అడవిదేవులపల్లి మండలంలోని చిట్యాల వద్ద నిర్మిస్తున్న దున్నపోతులగండి ఎత్తిపోతల పథకం ఇన్‌టేక్‌వెల్ పనులను ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, అధికారులతో కలిసి పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. దున్నపోతులగండి ఎత్తిపోతల పథకం ద్వారా 12,239 ఎకరాలకు సాగు నీరు అందించేందుకు రూ.219.19కోట్లు, దామరచర్ల మండలంలోని బొత్తలపాలెం ఎత్తిపోతల పథకం కింద 8,610 ఎకరాలకు సాగునీరు అందించేందుకు రూ.259.25కోట్లు, వీర్లపాలెం-2 ఎత్తిపోతల పథకం కింద 2,500 ఎకరాలకు సాగునీరు అందించేందుకు రూ.32.22కోట్లు, తోపుచర్ల ఎత్తిపోతల పథకం కింద 316 ఎకరాలకు సాగునీరు అందించేందుకు రూ.9.30కోట్లు, అదేవిధంగా దామరచర్ల మండలం కేశవాపురం ఎత్తిపోతల పథకం ద్వారా 5,875 ఎకరాలకు సాగునీరు అందించేందుకు రూ.75.93కోట్లను తక్షణమే మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. నాగార్జునసాగర్ ఎడమకాల్వ ప్రాజెక్టు ద్వారా ఈ ఏడాది రెండు పంటలకు పుష్కలంగా నీరందించనున్నామన్నారు. నియోజకవర్గంలోని ఐదు పథకాలకు మొత్తం రూ.490కోట్లు తక్షణమే విడుదల చేస్తున్నామన్నారు. ఈ పనులను 2025 ఆగస్టు 15 నాటికి పూర్తి చేయాలని సంబంధిత అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు.

ఎత్తిపోతలతో ఈ ప్రాంతం సస్యశ్యామలం

- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ నియోజకవర్గంలో చేపట్టిన ఎత్తిపోతల పథకాలు ఏడాదిలోపు పూర్తవుతాయని, దీంతో ఈ ప్రాంతం సస్యశ్యామలమవుతుందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఐదు ఎత్తిపోతల పథకాలతోపాటు వాచ్యాతండా-2 ఎత్తిపోతల పథకానికి నిధులు కేటాయించడంతోపాటు మూడు చెక్‌డ్యాంలను మంజూరు చేయాలని మంత్రిని కోరారు. నాగార్జునసాగర్ ఎడమకాల్వతోపాటు మైనర్ కాల్వలు చెట్లు, పూడికతో నిండిపోయాయని వాటికి నిధులు మంజూరు చేయాలని కోరారు. దీంతో స్పందించిన మంత్రి తక్షణమే చెక్‌డ్యాంల మంజూరుతోపాటు కాల్వ మరమ్మతులకు నిధులు విడుదల చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, నాయకులు దీరావత్ స్కైలాబ్‌నాయక్, పొదిల శ్రీనివాస్, తమ్మడబోయిన అర్జున్ పాల్గొన్నారు.




కాన్వాయ్ ఎదుట గ్రామస్థుల ఆందోళన

దున్నపోతులగండి ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించిన అనంతరం వెనుదిరిగిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కాన్వాయ్ ఎదుట స్థానికులు నిరసన తెలిపారు. టెయిల్‌పాండ్ ఏర్పాటుతో తమ గ్రామం ముంపునకు గురైందని, నిర్వాసితులమైన తమకు పూర్తి స్థాయిలో పరిహారం అందించలేదన్నారు. తక్షణమే ప్రభుత్వం తమను ఆదుకొని పరిహారం ఇవ్వాలని వేడుకున్నారు. పోలీసులు, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి వారికి నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.

గిరి ప్రదక్షిణ



యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడిని దర్శించుకునే భక్తులకు 'స్నాన సంకల్పం' ఆర్జిత సేవ అందుబాటులోకి వచ్చింది. అదేవిధంగా స్వామివారి జన్మనక్షత్రం రోజున స్వాతి నక్షత్రం పురస్కరించుకుని యాదగిరికొండ చుట్టూ గిరిప్రదక్షిణ నిర్వహించారు. ఈ ప్రదక్షిణలో ప్రభుత్వ అయిలయ్య కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.



ఇక గ్రీవెన్స్

ఫిర్యాదులపై దృష్టి

- » రుణమాఫీ కోసం వ్యవసాయశాఖకు రైతుల ఫిర్యాదులు
- » 34 కేటగిరీల ఆధారంగా అర్జీల పరిశీలన
- » అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీకి ప్రభుత్వ నిర్ణయం
- » ముందే అప్పు చెల్లించిన రైతులకు రీయింబర్స్‌మెంట్ లేనట్టేనా?

రుణమాఫీ కాలేదన్న ఆందోళనకు గురవుతున్న రైతులకు ప్రభుత్వం ఊరట ఇచ్చే విధంగా నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే రెండు దశల్లో లక్ష రుణంతోపాటు లక్షన్నర వరకు రుణాలు మాఫీ అయిన జాబితాల్లో పేరు లేని రైతులు నిరాశకు గురవుతున్నారు. దీంతో ఇప్పటికే గ్రీవెన్స్ సెల్ ద్వారా రైతుల నుంచి అందిన ఫిర్యాదులను పరిశీలించి వారికి సైతం రుణమాఫీ వర్తింపజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

- నల్లగొండ

నల్లగొండ జిల్లాలో సుమారు 1.70లక్షల మంది రైతులకు రెండు విడతల్లో సుమారు రూ.850కోట్లకు పైగా రుణాలు మాఫీ అయ్యాయి. మూడో విడత ఈ నెల 15తేదీన రూ.2లక్షల రుణం మాఫీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించి ఆ దిశగా ఏర్పాటు చేస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటన ముగించుకొని వచ్చాక ఏకకాలంలో ఒకేరోజు రుణమాఫీ చేయనున్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు ఆగస్టు 15 లోపు రుణమాఫీ పూర్తి చేసేందుకు అడుగులు వేస్తోంది. మూడో విడత రుణమాఫీకి ఆర్థికశాఖతో పాటు వ్యవసాయశాఖ, బ్యాంకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మూడో దశలో రూ.2లక్షల మాఫీతో మొత్తం రుణమాఫీ ప్రక్రియ పూర్తికానుంది. అయితే వివిధ కారణాలతో మిగిలిన రైతులకు గ్రీవెన్స్‌సెల్‌కు వచ్చిన అర్జీల ఆధారంగా రుణమాఫీ వర్తింపజేయనున్నారు.

డాటా నమోదులో బ్యాంకర్ల పొరపాటు

జిల్లాలోని పలు బ్యాంకులతో పాటు అధికారులు అందించిన డాటాలో పొరపాట్ల కారణంగా పలు సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయి. ఖాతా నెంబర్ల పొరపాటు, కట్ ఆఫ్ డేట్ నిర్ణయించడంలో నిర్లక్ష్యం, అర్హులైన రైతుల జాబితాను అందించడంలో ఆలస్యం వంటివి చోటు చేసుకున్నట్టు తెలుస్తోంది. కొద్దిరోజుల క్రితం మొదటి దశలో రూ.1లక్ష వరకు రుణమాఫీ విషయంలో కనగల్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు మాఫీ అందకపోవడంతో కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేశారు. బ్యాంకర్లతో పాటు పీఏసీఎస్ కార్యదర్శులు సైతం డాటాను సకాలంలో అందించకపోవడంతో చాలా మంది రైతులకు నష్టం వాటిల్లింది. ఈ నేపథ్యంలో నష్ట నివారణకు ప్రభుత్వ ఆదేశం మేరకు మండల వ్యవసాయ కార్యాలయాలతో పాటు జిల్లా వ్యవసాయ కార్యాలయంలో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా అధికారులకు ఆ బాధ్యతను అప్పగించి రుణమాఫీకి అర్హత ఉండి జాబితాలో పేరు లేని రైతుల నుంచి ఫిర్యాదులు తీసుకున్నారు. ఈ ఫిర్యాదులన్నింటినీ ఇప్పటికే ఆన్‌లైన్‌లో నమోదు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించారు. ఈ నెల 15 తర్వాత ప్రభుత్వ సూచన మేరకు ఫిర్యాదులన్నింటినీ పరిశీలించనున్నారు. లీడ్ బ్యాంక్ అధికారులతో పాటు బ్యాంకు మేనే

34 కేటగిరీలు..

ప్రభుత్వ ఆదేశాల మేరకు 34కేటగిరీల ఆధారంగా దరఖాస్తులు పరిశీలించనున్నారు. మూడో విడత రుణమాఫీ అనంతరం ఈ దరఖాస్తులన్నింటినీ పరిశీలించి ప్రభుత్వానికి నివేదిస్తారు. జిల్లాలోని గ్రీవెన్స్‌లకు 12,790దరఖాస్తులు రాగా, అందులో 4,300 దరఖాస్తులను ఇప్పటికే ఓకే చేశారు. ఆ ఖాతాలకు సంబంధించి రుణమాఫీ ప్రాసెస్‌లో ఉంది. మిగతా దరఖాస్తులను ఆధార్ కార్డు నెంబర్, రుణమాఫీ నెంబర్, కుటుంబ సభ్యుల నిర్ధారణ ఇలా కేటగిరీల వారీగా విభజించారు. కొందరికి పట్టాదారు పాస్‌పుస్తకం లేకపోవడం, ప్రభుత్వ ఉద్యోగి ఉన్న విషయాన్ని గమనంలోకి తీసుకోవడం, మూడు విడతల్లో రుణమాఫీ కాకపోవడానికి కారణాలను కేటగిరీల వారిగా విభజించారు. ఎవరైనా రైతు చనిపోతే మార్పిడి చేయడం, కొత్త పాస్‌పుస్తకం అందకపోతే దానికి కారణాలను ఆ కేటగిరీలో నమోదు చేస్తారు. ఆధార్‌లో ఓ పేరు, రుణమాఫీలో మరోపేరు ఉన్నా, మంజూరైన రుణం కంటే 2023 డిసెంబరు 9 నాటికి ఉన్న బకాయిని కూడా పరిశీలిస్తారు. దీనికి తోడు దరఖాస్తుల పరిశీలనతో పాటు కొత్త ఖాతాలను కూడా ఆడిట్ చేయాలని నిర్ణయించారు.

మూడో దశ మాఫీ తరువాత దరఖాస్తుల పరిశీలన



ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో గ్రీవెన్స్ ద్వారా వచ్చిన దరఖాస్తులను మూడో విడత రుణ మాఫీ అనంతరం పరిశీలిస్తాం. కేటగిరీల వారీగా దరఖాస్తులను విభజించడం జరిగింది. వచ్చిన దరఖాస్తుల్లో 4,300 రైతుల ఖాతాలకు సంబంధించి రుణమాఫీ ప్రాసెస్‌లో ఉంది. అర్హులైన ప్రతీ ఒక్క రైతుకు రుణమాఫీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించి అందుకు అనుగుణంగా ఆదేశాలు జారీ చేసింది.

- పి.శ్రవణ్‌కుమార్, నల్లగొండ జేడీఏ

జర్లు, వ్యవసాయశాఖ అధికారులు, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో అర్జీలను పరిశీలించేలా మార్గదర్శకాలను విడుదల చేశారు. అర్హత ఉన్నా ఏ ఒక్క రైతు నష్టపోవద్దని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసిన నేపథ్యంలో అర్జీల పరిశీలన పకడ్బందీగా చేపట్టే అవకాశాలు ఉన్నాయి.

ముందే అప్పు చెల్లించిన రైతులకు మాఫీ లేనట్టేనా?

గత ప్రభుత్వం విడతలవారీగా రుణమాఫీ చేయడంతో ముందే అప్పు చెల్లించిన రైతులకు మాఫీ వర్తింపజేస్తామని ప్రకటించింది. దీంతో చాలామంది రైతులు కటాఫ్ డేట్ ప్రకారం వడ్డీ భారం పడకుండా ఉండేందుకు తీసుకున్న రుణాన్ని బ్యాంకులకు చెల్లించారు. దీంతో చాలామంది బ్యాంకర్లు ఆయా రైతుల ఖాతాలను హోల్డ్‌లో పెట్టి రుణమాఫీ వర్తింపజేసేలా చూశారు. తీసుకున్న రుణంపై వడ్డీ పెరగడంతో తామే భరించాల్సి వస్తుందని రైతులు ముందుగానే అప్పు చెల్లించారు. దీంతో అప్పటి ప్రభుత్వం కూడా ప్రత్యేకంగా ఓపెన్ చేసిన యాప్‌లో అప్పు చెల్లించిన వారి రైతుల ఖాతాలను నమోదు చేసి వారి రుణాలు మాఫీకి సంబంధించిన డబ్బు తిరిగి రీయింబర్స్‌మెంట్ చేసేలా ప్రాసెస్‌లో ఉందంటూ నమోదు చేశారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ముందే అప్పు చెల్లించిన రైతులకు మొండి చేయిచూపేలా రుణమాఫీకి సంబంధించిన రీయింబర్స్‌మెంట్ చేయడం లేదు. ఇటీవల జారీ చేసిన మార్గదర్శకాల్లో కూడా రీయింబర్స్‌మెంట్ విధానాన్ని చూపలేదు. దీంతో తీసుకున్న అప్పులను ముందే చెల్లించిన రైతులు ప్రస్తుతం నిరాశతో ఉన్నారు. ఈ విషయంపై అటు బ్యాంకర్లు ఇటు ప్రభుత్వం కూడా ఏమాత్రం స్పందించకపోవడంతో రైతులకు పాలుపోవడం లేదు.

వాతావరణ సమతుల్యత కోసం మొక్కలు నాటాలి

కలెక్టర్ నారాయణరెడ్డి



అనంతరం మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

మిర్యాలగూడ, ఆగస్టు 11: పారిశ్రామికీకరణతో అభివృద్ధి జరుగుతోందని, అదే సమయంలో వాతావరణ సమతుల్యత కూడా అవసరమని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం మిర్యాలగూడ పట్టణం, అవంతిపురం ఈద్గా వద్ద వనమహోత్సవంలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వనమహోత్సవంలో భాగంగా మిర్యాలగూడ పట్టణంలో 25వేల మొక్కలు నాటి సంరక్షించాలనే సంకల్పం హర్షనీయమన్నారు. ఈ ప్రాంతంలో పరిశ్రమలు ఎక్కువగా ఉన్నాయని, వాటి వల్లే అభివృద్ధి సాధ్యమైందన్నారు. అయితే వాతావరణం కలుషితం కాకుండా పెద్ద సంఖ్యలో మొక్కలు నాటాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యమన్నారు. మొక్కలు నాటడమే గాక వాటి సంరక్షణపై దృష్టిసారించాలన్నారు. ఉపాధిహామీ పథకం కింద మూడేళ్ల వరకు మొక్కలు నాటి సంరక్షించే అవకాశం ఉందన్నారు. మొక్కల సంరక్షణకు వాచర్లను నియమించుకోవాలన్నారు. అన్ని గ్రామ పంచాయతీల్లో నీటి ట్యాంకర్లు ఉన్నందున వాటిని ఉపయోగించుకుని మొక్కలు చనిపోకుండా చూడాలని అన్నారు. ఎమ్మెల్యే బీఎల్ఆర్ మాట్లాడుతూ, పట్టణ పరిసర ప్రాంతాల్లో పరిశ్రమలు ఎక్కువగా ఉన్నందున పచ్చదనాన్ని పరిరక్షించే కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. మొక్కలు నాటే కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు మహబూబ్‌అలీ, తమ్మరబోయిన అర్జున్, స్కైలాబ్‌నాయక్, కౌన్సిలర్ జానీ, ఎండి.హజర్, తదితరులు పాల్గొన్నారు.

బాలికలు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బండారు ప్రసాద్



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

నల్లగొండ స్పోర్ట్స్, ఆగస్టు 11: బాలికలు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బండారు ప్రసాద్ అన్నారు. జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని మేకల అభినవ్ స్టేడియంలో నిర్వహించిన సీనియర్ మహిళల జట్ల ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర స్థాయిలో ఈనెల 16 నుంచి 19వతేదీ వరకు నిజామాబాద్‌లో జరిగే ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచి ప్రథమస్థానంలో నిలిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. చదువుతో పాటు ఆటల్లో రాణిస్తే విద్య, ఉద్యోగాల్లో మంచి అవకాశం ఉంటుందని అన్నారు. అనంతరం జరిగిన ఎంపిక పోటీల్లో బాలికలు పోటీపడ్డారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ ఓరుగంటి శ్రీనువాస్ ఆధ్వర్యంలో రాములు ఫౌండేషన్ ద్వారా క్రీడాకారులకు క్రీడా దుస్తులు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫుట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ గంట్ల అనంతరెడ్డి, డాక్టర్ శ్రీనివాస్, నాయకులు రావుల శ్రీనివాస్‌రెడ్డి, రావిరాల వెంకటేశ్వర్లు, మోతుక్కూర్ యాదయ్య, బొడ్డుపల్లి సునితవెంకట్, కోచ్ మద్ది కరుణాకర్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

చర్లగూడ రిజర్వాయర్‌ను పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం

సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం

మర్రిగూడ, ఆగస్టు 11: కరువు, ఫ్లోరైడ్ పీడిత ప్రాంతమైన మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాల సాగు, తాగునీరు అందించే డిండి ఎత్తిపోతల పథకాన్ని, చర్లగూడ రిజర్వాయర్ పనులను వెంటనే పూర్తి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. ఆదివారం స్థానికంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దశాబ్దాల తరబడి కరువుతో అలమటిస్తున్న మునుగోడు, దేవరకొండ నియోజకవర్గంపై గత టీఆర్ఎస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చూపిందని, దీంతో ప్రాజెక్టులు పూర్తి కాలేదని ఆరోపించారు. 2015లో శంకుస్థాపన చేసిన రిజర్వాయర్ ఇంతవరకు పని పూర్తి చేయకపోగా, నిర్వాసితులకు కూడా పూర్తి పరిహారం అందించడంలో గత ప్రభుత్వం విఫలమైనదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నిర్వాసితులకు పరిహారం విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ఈదుల బిక్షం రెడ్డి, ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి చెల్లం పాండురంగారావు, నాయకులు బూడిద సురేష్, బుర్ర శేఖర్, ఆకుల రఘుమయ్య, ఎరుకల నిరంజన్, కళ్యాణ్, యాదగిరిరెడ్డి, కూస్‌రెడ్డి గిరి, ఇసుకుల మహేందర్, ఆకుల వెంకట్రామ్, అయితపక్క హరి, అంజయ్య, కొట్టం మల్లేష్, అయితగోని వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

డిండి డీపీఆర్‌ను ఆమోదించాలి

డిండి: డిండి ఎత్తిపోతల పథకం డీపీఆర్‌ను ఆమోదించి పూర్తి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెలికంటి సత్యం డిమాండ్ చేశారు. ఆదివారం డిండిలో మంత్రి ఉత్తమ్‌ని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎస్ఎల్‌బీసీకి నిధులు కేటాయించి పూర్తిచేసి సాగునీరు అందించాలన్నారు. డిండి ఎత్తిపోతల ప్రాజెక్టు పూర్తయితే దేవరకొండ, మునుగోడు నియోజకవర్గంలోని మూడున్నర లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ప్రాజెక్టు కింద భూములు కోల్పోతున్న నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం, పునరావాసం కల్పించాలని కోరారు. వినతిపత్రం అందజేసినవారిలో వెంకటరమణ, మైనుద్దీన్, శైలేష్, ప్రభాకర్‌రావు, నవీన్ ఉన్నారు.

వీరలక్ష్మీదేవిగా దర్వేశీపురం

ఎల్లమ్మ



కనగల్, ఆగస్టు 11: మండలంలోని దర్వేశీపురం స్టేజీ వద్ద ఉన్న రేణుకా ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారు శ్రావణమాసం మొదటి ఆదివారాన్ని పురస్కరించుకుని వీరలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. చీరసారె, ఒడి బియ్యం సమర్పించి మొక్కు తీర్చుకున్నారు.

వినియోగదారులకు చట్టాలపై అవగాహన కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జైస్వాల్

నాగార్జునసాగర్, ఆగస్టు 11: వినియోగదారులకు చట్టాలపై అవగాహన కల్పించాలని వినియోగదారుల వివాదాల పరిష్కార కమిటీ మాజీ చైర్మన్ జైస్వాల్ అన్నారు. రెండు రోజులుగా సాగర్ హిల్‌కాలనీ విజయవిహార్ అతిథి గృహంలో నిర్వహిస్తున్న రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. వినియోగదారులకు చట్టాలపై అవగాహన కల్పిస్తూ సమస్యల పరిష్కారానికి సహాయం చేయాలన్నారు. వినియోగదారులు చైతన్యవంతంగా ఉండాలన్నారు. అనంతరం సాగర్ ఇన్‌చార్జి నారాయణరెడ్డి మాట్లాడుతూ, పెట్రోల్ బంకుల్లో ఏ విధంగా మోసాలు జరుగుతున్నాయో వివరించారు. కార్యక్రమంలో రెరా చైర్మన్ సత్యనారాయణ, శ్రీకాంత్, మట్టయ్య, నారాయణరెడ్డి, మనోహర్, కోటిరెడ్డి, వెంకటేశ్వర్లు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ స్వాతి, రవీంద్ర యాదవ్ పాల్గొన్నారు.

పెళ్లింట విషాదం

• సాగర్ ఎడమ కాల్వలో యువకుడి గల్లంతు

• సూర్యాపేట జిల్లా వెలిదండ వద్ద ఘటన

గరిడేపల్లి, ఆగస్టు 11: నాగార్జునసాగర్ ఎడమ కాల్వలో పడి ఓ యువకుడు గల్లంతయ్యాడు. ఆదివారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలో ఈ ఘటన జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్‌కు చెందిన లచ్చుమళ్ల వెంకట్ ఈ నెల 10వ తేదీన వెలిదండ గ్రామంలో బంధువుల పెళ్లికి వచ్చాడు. ఆదివారం ఉదయం బంధువులు స్నానం చేసేందుకు నాగార్జునసాగర్ ఎడమ కాల్వ పరిధిలోని ఎత్తిపోతల వద్దకు వెళ్లారు. కాస్త ఆలస్యంగా వెళ్లిన వెంకట్‌కు అక్కడ ఎవరూ కన్పించకపోవడంతో స్నానం చేసేందుకు కాల్వలోకి దిగాడు. అయితే కాల్వకు ఆరు మెట్ల వరకే ఉండగా, కింది వరకు మెట్లు ఉన్నాయనుకొని వెంకట్ నీటిలోకి దిగాడు. అయితే ఆరో మెట్టు తర్వాత కింద మెట్లు లేకపోవడం, వెంకట్‌కు ఈత రాకపోవడంతో నీళ్లలోకి దిగి కొట్టుకుపోయాడు. అయితే స్నానానికి సాగర్ ఎడమ కాల్వకు వెళ్లిన వెంకట్ ఎంతకూ తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు గాలించగా, కాల్వ వెంట దుస్తులు, చెప్పులు కన్పించాయి. దీంతో స్నానానికి దిగిన వెంకట్ కొట్టుకుపోయినట్లు నిర్ధారించారు. ఆచూకీ కోసం కాల్వవెంట వెతికినా ఫలితం లేకుండాపోయింది. అప్పటి దాకా తమతో కలిసి మెలిసి ఉన్న వ్యక్తి ఒక్కసారిగా కన్పించకుండా పోవడంతో పెళ్లింట విషాదం నెలకొంది. వెంకట్ హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్నాడు. రాత్రి పొద్దుపోయే వరకూ వెంకట్ మృతదేహం లభించలేదు. ఈ విషయపై ఎస్‌ఐ ఈట సైదులును వివరణ కోరగా ఎవరూ ఫిర్యాదు చేయలేదని తెలిపారు.



గల్లంతైన యువకుడు వెంకట్

ఆస్తి కోసం తల్లిదండ్రులపై దాడి

• సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలంలో ఘటన

హుజూర్‌నగర్, ఆగస్టు 11: పండుటాకులకు ఆసరాగా ఉండాల్సిన కుమార్తె మానవత్వం మరిచింది. జీవిత చరమాంకంలో ఆసరాగా ఉంటుందనుకుని తల్లిదండ్రులు తమ పేరిట ఉంచుకున్న భూమిపై భర్తతో కలిసి కుమార్తె కన్నేసింది. ఆ ఆస్తిని తన పేరిట రాయించుకునే ప్రయత్నం చేసింది. తండ్రి పేరిట ఉన్న కొద్దిపాటి భూమిని వేరే వారికి కౌలుకు ఇచ్చింది. దీనిని ప్రశ్నించిన తల్లిదండ్రులపై భర్త, కుమారుడితో కలిసి దాడి చేసింది. ఈ అమానవీయ ఘటన సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం బూరుగడ్డ గ్రామంలో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ మండలం బూరుగడ్డ గ్రామానికి చెందిన చిరుమామిళ్ల పుల్లారావు, పద్మ దంపతులకు ముగ్గురు కుమార్తెలు విజయ, శ్రీలత, పావని ఉన్నారు. చిన్న కుమార్తె పావనిని బూరుగడ్డకు చెందిన రవికి ఇచ్చి వివాహం చేశారు. పుల్లారావుకు మూడు ఎకరాల 18గుంటల పొలం ఉంది. ముగ్గురు కుమార్తెలకు ఒక్కో ఎకరం చొప్పున వివాహ సమయంలో ఇచ్చారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులు పద్మ, పుల్లారావును చిన్న కుమార్తె పావని చూసుకోవాలని పెద్దమనుషుల సమక్షంలో గతంలో నిర్ణయించారు. తల్లిదండ్రుల తదనంతరం పావనికి 18గుంటలు ఇచ్చేలా ఒప్పందం చేశారు. కాగా, తల్లిదండ్రుల పేరిట ఉన్న 18గుంటల భూమిని కుమార్తె, తన భర్త సాయంతో సాదాబైనామాలో పేరు ఎక్కించింది. తనకు తెలియకుండా సాదాబైనామాలో పేరు ఎలా ఎక్కిస్తారంటూ పుల్లారావు, పద్మ దంపతులు కుమార్తెను, అల్లుడిని నిలదీశారు. మొదటినుంచి ఈ మొత్తం భూమి 3.18ఎకరాల భూమిని పుల్లారావే సేద్యం చేస్తున్నాడు. వానాకాలం సీజన్ ప్రారంభం కాగానే కుమార్తె పావని, భర్త రవి సాయంతో తండ్రి సాగే చేసే 1.18ఎకరాలను ఇతరులకు కౌలుకు ఇచ్చింది. వేరే వ్యక్తులు దున్నుతుండగా, కౌలు విషయం తెలుసుకున్న పావని తల్లిదండ్రులు అక్కడికి వెళ్లి అడ్డుకున్నారు. దీంతో కుమార్తె పావని, అల్లుడు రవి, మనుమడు మోహన్ పొలం వద్ద ఉన్న పుల్లారావు, పద్మలపై గొడ్డలి, కర్రలతో దాడి చేశారు. గమనించిన చుట్టుపక్కన ఉన్న రైతులు వచ్చి దాడిని అడ్డుకున్నారు. గాయపడిన వృద్ధ దంపతులను స్థానికులు హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పెంచి పెద్ద చేసిన బిడ్డ, అల్లుడు, మనుమడు తమపై దాడి చేశారని పుల్లారావు, పద్మ దంపతులు విలేకరులతో చెప్పి కన్నీటిపర్యంతమయ్యారు. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను బిడ్డే భర్తతో కలిసి దాడి చేయడం గ్రామంలో కలకలం రేపింది. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ ముత్తయ్య తెలిపారు.



గాయపడిన పుల్లారావు, పద్మ

నిడమనూరుకు జ్వరమొచ్చింది

● పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం ● జ్వరాలతో అల్లాడుతున్న ప్రజలు ● ఇంటికొకరు మంచం పట్టిన వైనం ● ఆస్పత్రుల నిండా బాధితులే ● బదిలీలతో వైద్య సిబ్బంది కొరత



నిడమనూరు ఆరోగ్య కేంద్రంలో క్యూ కట్టిన రోగులు



గ్రామంలో పేరుకుపోయిన చెత్త

నిడమనూరు, ఆగస్టు 11: నల్లగొండ జిల్లా నిడమనూరు మండలంలోని అనేక గ్రామాల్లో ప్రజలు జ్వరాలతో సతమతమవుతున్నారు. ఏ ఒక్కరినీ కదిలించినా జ్వరంతో బాధపడుతున్నామంటున్నారు. ఇంటికొకరు జ్వరం బారిన పడి మంచంపట్టారు. గ్రామాల్లో పారిశుధ్యం లోపించడంతో సీజనల్ వ్యాధులు వ్యాపించే కాలంకావడంతో అనేక మంది జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారు. సీజనల్ వ్యాధులపై ప్రభుత్వం గ్రామాల్లో సర్వే చేస్తున్నప్పటికీ రోగుల సంఖ్య మాత్రం రోజురోజుకూ పెరుగుతోంది. గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగు పర్చకపోవడంతో దోమల బెడద విపరీతంగా ఉంది. దోమల నివారణకు కనీసం ఫాగింగ్ కూడా సక్రమంగా చేయడంలేదు. గ్రామాల్లో ప్రత్యేక పాలనలో పారిశుధ్యం పడకేసింది. కొన్ని గ్రామాల్లో మురుగు కాల్వలను కూడా శుభ్రం చేయడం లేదు. దీంతో ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. ప్రభుత్వ ప్రైవేటు ఆస్పత్రుల నిండా జ్వరాల బాధితులే కనిపిస్తున్నారు. ప్రజలు జ్వరాలతోపాటు ఒళ్లు, కీళ్ల నొప్పులతో బాధపడుతున్నారు. సాధారణ జ్వరాలే అని వైద్య సిబ్బంది చెబుతున్నప్పటికీ రోజుల తరబడి తగ్గకపోవడంతో విష జ్వరాలేమోనని ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. కొందరు మలేరియా, టైఫాయిడ్ జ్వరాలతో బాధపడుతున్నారు. మండలంలోని గుంటిపల్లి శివారు జంగాలవారిగూడెంలో ఓ ఇద్దరు డెంగ్యూ బారిన పడి ఎలాగోలా కోలుకున్నట్లు తెలిసింది. ప్రజలు గ్రామాల్లో ఆర్ఎంపీల వద్ద వైద్యం చేయించుకుంటున్నారు.

ప్రైవేట్‌కు వెళ్లి.. రూ.వేలు ఖర్చు

జ్వరాలు తగ్గకపోవడంతో పట్టణాలకు వెళ్లి ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్సలకోసం రూ.వేలకు వేలు ఖర్చు చేసుకుంటున్నారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు, గ్రామాల్లో ఉపకేంద్రాలు ఉన్నప్పటికీ సిబ్బంది కొరతతో రోగులు ఎక్కువగా ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా భావించి ప్రైవేటు వైద్యులు చికెన్‌గున్యా, డెంగీ, రక్త కణాలు తగ్గిపోవడం వంటి పేర్లతో రకరకాల టెస్టులు చేస్తూ ఆరోగ్యం పేరుతో ప్రజలను అందిన కాడికి దోచుకుంటున్నారు. నిడమనూరు మండలకేంద్రంలోని పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు, ఇద్దరు సూపర్‌వైజర్లు, ఇద్దరు స్టాఫ్ నర్సులతో పాటు సగం మంది ఆరోగ్య సిబ్బంది ఒకేసారి బదిలీ అయ్యారు. వారి స్థానాల్లో కొత్తవారు రాకపోవడంతో సిబ్బంది కొరత వేధిస్తోంది. ఏదో ఒకరిద్దరు ఇన్‌చార్జులతో నెట్టుకొస్తున్నారు. గ్రామాల్లోని ఉపకేంద్రాల్లో పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. మొదట ఏఎన్ఎంలు లేకపోవడంతో రెండో ఏఎన్ఎంలతో నడిపిస్తున్నారు. పీహెచ్‌సీలో మందుల కొరత కూడా ఉంది. కనీసం పరిగడుపున వేసుకునే గ్యాస్ మాత్రలు కూడా లభ్యం కావడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొందరు ఆరోగ్య సిబ్బంది సైతం జ్వరాలతో బాధపడుతూ సెలవుల్లో ఉన్నారు. వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం

గ్రామాల్లో జ్వర సర్వే నిర్వహిస్తున్నాం. ఈ సీజన్‌లో సాధారణ జ్వరాలు రావడం మామూలుగా జరుగుతుంది. జ్వరాలతో పీహెచ్‌సీకి వచ్చే వారికి తగిన వైద్య సేవలు అందిస్తున్నాం. పరిశుభ్రతే వ్యాధుల నివారణకు మార్గం. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపర్చాలి.

డాక్టర్ భావిజ్ఞ, ఇన్‌చార్జి వైద్యురాలు.

వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్నా



వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్నా. తగ్గినట్లే తగ్గి మళ్లీ జ్వరం వస్తుంది. భయంతో అన్ని రకాల టెస్టులు చేయించుకున్నాను. టైఫాయిడ్‌గా నిర్ధారణ అయింది. వైద్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించి వ్యాధుల నివారణకు సత్వరం చర్యలు తీసుకోవాలి.

కే.యల్లయ్య, ముప్పారం.

విష జ్వరాలతో తల్లడిల్లుతున్న ప్రజలు

హుజూర్‌నగర్: విషజ్వరాలతో ప్రజలు తల్లడిల్లుతున్నారు. వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు పత్తా లేకుండాపోయారు. పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా ఎటు చూసినా ప్రజలు మంచాలపై జ్వరాలతో మూలుగుతున్నారు. డెంగ్యూ, చికన్‌గున్యా జ్వరాలు తాండవం చేస్తున్నాయి. మండలంలోని బూరుగడ్డ, లక్కవరం, లింగగిరి, శ్రీనివాసపురం, గోపాలపురంలో ప్రతి ఇంట్లో గ్రామస్థులు విషజ్వరాలతో బాధపడుతున్నారు. ముఖ్యంగా గోపాలపురం, లక్కవరం, బూరుగడ్డ గ్రామాల్లో సగం మందికి పైనే జ్వరాల బారిన పడ్డారు. నెలరోజులుగా ప్రజలు జ్వరాలతో బాధపడుతున్నా మండల వైద్యాధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవని ఆరోపిస్తున్నారు. మొక్కుబడిగా రెండురోజుల క్రితం డీఎంహెచ్‌వో ఇలా వచ్చి అలా వెళ్లారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఆయుష్ వైద్య విభాగానికి చెందిన ఒకరిద్దరు వచ్చి వెళ్లారని వాపోతున్నారు. సుమారు వేయిమందికి పైనే గ్రామస్థులు విషజ్వరాలతో తల్లడిల్లుతున్నారు. అధికారుల పాలన అస్తవ్యస్థంగా ఉండడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రిలో రోజుకు 200మంది చొప్పున జ్వరాలకు చికిత్సపొందుతున్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ ఇదే రీతిలో వైద్య చికిత్సలు చేయించుకుంటున్నారు. హుజూర్‌నగర్ మునిసిపాలిటీ, మండలంలో 1000మందికి పైనే గ్రామస్థులు విషజ్వరాలతో తల్లడిల్లుతున్నారు. డెంగీ, టైఫాయిడ్, చికన్‌గున్యా లాంటి వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు ఖమ్మం, హైదరాబాద్‌లాంటి ప్రాంతాలకు చికిత్సలకై వెళ్లి వైద్యం చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పట్టణంలోని అనేక ప్రైవేట్ ఆస్పత్రుల్లో డెంగీ జ్వరంతో ప్రజలు వైద్యం చేయించుకుంటున్నారు. ఇదిలా ఉండగా పట్టణంలోని గోవిందాపురం, శ్రీనగర్ కాలనీ, మల్లన్ననగర్, అంబేడ్కర్‌నగర్ కాలనీ, దళితవాడ, మట్టపల్లి రోడ్డు ప్రాంతాల్లోని ప్రజలు విషజ్వరాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో పారిశుధ్యం పడకేసిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి మెడికల్ క్యాంప్ ఏర్పాటుచేయాలని ప్రజానీకం డిమాండ్ చేస్తుంది.

వైద్య శిబిరం ఏర్పాటుచేయాలి



విషజ్వరాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మెడికల్ క్యాంప్‌లు వెంటనే ఏర్పాటుచేయాలి. అధికారులు నిర్లక్ష్యం చేయడం వల్ల ఇప్పటికే చాలామంది డెంగ్యూ జ్వరంతో చనిపోయారు. అధికారులు పట్టించుకోవడం లేదు. వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు గ్రామాల వైపు కన్నెత్తి చూడడం లేదు. పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా డెంగ్యూ జ్వరాలు ప్రజలను వెంటాడుతున్నాయి.

- కాలువ శ్రీనివాసరావు, స్థానికుడు

పాత నేరేడుచర్లలో దొంగతనం

● 50వేలు నగదు, వెండి బంగారు ఆభరణాలు చోరీ



ఇంట్లో బీరువా తెరిచి వస్తువులు పడేసిన దొంగలు

నేరేడుచర్ల, ఆగస్టు 11: సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల పరిధిలోని పాత నేరేడుచర్లలో నూకల జానకమ్మ ఇంట్లో దొంగలు పడి రూ.50 వేలు, ఎనిమిది తులాల వెండి, రెండు తులాల బంగారు ఆభరణాలు అపహరించుకుపోయారు. నేరేడుచర్ల ఎస్ఐ రవీంద్రనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. నూకల జానకమ్మ పెన్‌పహాడ్ మండలం నారాయణగూడెం గ్రామంలోని ఆమె అక్క ఇంటికి శనివారం సాయంత్రం వెళ్లింది. ఇంటికి తాళంవేసి, బయట గేటుకు కూడా తాళం వేసి వెళ్లింది. శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గోడదూకి, లోపలికి వెళ్లి గొళ్లెం కోసి తలుపులు తెరిచి లోనికి వెళ్లి బీరువా పగులగొట్టారు. ఆదివారం ఇంటికి వచ్చేసరికి తలుపు తీసి ఉండడంతో ఇంట్లోకి వెళ్లి దొంగతనం జరిగినట్లు తెలిసింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ రవీంద్రనాయక్ సిబ్బందితో వచ్చి వివరాలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పిచ్చి కుక్క దాడిలో ఇద్దరికి గాయాలు

మద్దిరాల, ఆగస్టు 11: పిచ్చి కుక్కదాడిలో ఇద్దరికి గాయాలయ్యాయి. సూర్యాపేట జిల్లా మద్దిరాల మండల పరిధిలోని పోలుమళ్ల గ్రామంలో ఆదివారం ఈ ఘటన జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చామకూరి మల్లయ్య, కేతం ఉప్పలయ్య వీధుల వెంట వెళ్తుండగా అకస్మాత్తుగా పిచ్చి కుక్క వచ్చి వారిపై దాడిచేయడంతో గాయాలయ్యాయి. గాయాలైన వారిని సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించారు.

కొనసాగుతున్న కృష్ణమ్మ సవ్వడి

● 14 క్రస్ట్ గేట్ల ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల ● సాగర్‌లో పర్యాటకుల సందడి



నాగార్జునసాగర్‌లో పర్యాటకుల సందడి



నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ వద్ద హీరోయిన్ లయ

నాగార్జునసాగర్, కేతేపల్లి, మేళ్లచెర్వు, ఆగస్టు 11: నల్లగొండ జిల్లాలోని నాగార్జునసాగర్ నుంచి కృష్ణమ్మ సవ్వడి కొనసాగుతోంది. గత మూడు రోజులుగా 26క్రస్ట్ గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేసిన అధికారులు ఆదివారం ఉదయం నుంచి గేట్ల సంఖ్యను తగ్గిస్తూ ఉదయం 10గంటల సమయం నుంచి ఎనిమిది క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని విడుదల చేశారు. స్వల్పంగా వరద రాక పెరగడంతో రాత్రి 10 గంటలకు 14 క్రస్ట్‌గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు(312.5050టీఎంసీలు) కాగా ఆదివారం రాత్రికి 588.60 అడుగులుగా(307.8742టీఎంసీలు) ఉంది. సాగర్ నుంచి కుడికాల్వ ద్వారా ఎలాంటి నీటి విడుదల లేదు.ఎడమ కాల్వ ద్వారా 8,454 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,476 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, వరద కాల్వ ద్వారా 300 క్యూసెక్కులు, 14 క్రస్ట్ గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 1,11,342 క్యూసెక్కులు మొత్తంగా సాగర్ నుంచి మొత్తం 1,51,072 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

వరుస సెలవు దినాలు కావడంతో పర్యాటకుల సందడి

శని, ఆదివారాలు వరుస సెలవు దినాలు కావడంతో సాగర్‌లో పర్యాటకుల సందడి నెలకొంది. ఆదివారం సాగర్‌కు పర్యాటకులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ప్రధాన డ్యాం, జలవిద్యుత్ కేంద్రం మార్గాల్లో పోలీసులు ఆంక్షలు విధించారు. సినీ నటి లయ ఆదివారం సాగర్ సందర్శనకు వచ్చారు.

ఊట నీరే తాగు నీరు

సాగర్‌కు అధిక సంఖ్యలో పర్యాటకులు వస్తున్న నేపథ్యంలో మునిసిపల్, ప్రాజెక్టు, అధికారులు ఎవరు కూడా కనీసం తాగు నీరు, మూత్రశాలల వంటి మౌలిక వసతులను ఏర్పాటు చేయలేదు. పక్కనే ఉన్న కొండల నుంచి వచ్చే ఊట నీటికి కానుగ చెట్టు ఆకులను అడ్డుగా పెట్టి బాటిళ్లలో నీటిని నింపుకొని దాహార్తిని తీర్చుకున్నారు.

మూసీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

ఎగువ మూసీ పరివాహక ప్రాంతాల నుంచి ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో నిలకడగా కొనసాగుతోంది. 645 అడుగుల (4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు నీటిమట్టం ఆదివారం సాయంత్రానికి 641.70 అడుగులుగా(3.62టీఎంసీ) ఉంది. మరోవైపు మూసీ ఆయకట్టులో వానాకాలం పంటల సాగు కోసం ప్రాజెక్టు కుడి కాల్వకు 208.98 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 185.76 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

'పులిచింతల'లో మూడు గేట్ల ద్వారా నీటి విడుదల

ఉభయ తెలుగు రాష్ట్రాల సరిహద్దులోని పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద ప్రవాహం తగ్గుముఖం పట్టింది. శనివారం సాయంత్రం ఆరు గంటలకు 3,29,000 క్యూసెక్కులుగా నమోదైన వరద ప్రవాహం, ఆదివారం సాయంత్రానికి 1,01,555 క్యూసెక్కులకు తగ్గింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 175 అడుగులు(45.77 టీఎంసీలు) కాగా, ఆదివారం సాయంత్రానికి 166.89 అడుగులుగా(34.10 టీఎంసీలు) నమోదైంది. ప్రాజెక్టులో ఇంకా 10టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉండటంతో ప్రాజెక్టు 15 గేట్ల ద్వారా నీటిని శనివారం విడుదల చేసిన అధికారులు, ఆదివారం మూడు గేట్లను రెండు మీటర్ల మేర ఎత్తి 48క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తెలంగాణ జల విద్యుత్ కేంద్రంలో 16వేల క్యూసెక్కుల నీటిని వినియోగిస్తూ నాలుగు యూనిట్ల ద్వారా 80 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేస్తున్నారు. మొత్తం ప్రాజెక్టు అవుట్‌ఫ్లో 64,889 క్యూసెక్కులుగా నమోదైంది.

గంజాయి విక్రేతల అరెస్ట్

కట్టంగూరు, ఆగస్టు 11: కట్టంగూరులో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు శాలిగౌరారం రూరల్ సీఐ కొండల్ రెడ్డి తెలిపారు. కట్టంగూరు పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ శ్రీనుతో కలిసి ఆదివారం వివరాలు వెల్లడించారు. కట్టంగూరు మండలంలోని ఈదులూరు గ్రామానికి చెందిన లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్న కురిమిళ్ల శివప్రసాద్, నార్కట్‌పల్లి మండలానికి చెందిన మంద మధు, గిద్దలూరు గ్రామానికి చెందిన లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్న నామ శ్రీకాంత్‌లు ఛత్తీస్‌ఘడ్ నుంచి 745 గ్రాముల గంజాయిని తీసుకొచ్చారు. కట్టంగూరు శివారు నుంచి వారి స్వగ్రామాలకు వెళ్లేందుకు సిద్ధమవగా, పోలీసులకు అందిన సమాచారం మేరకు వారిని అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేయగా శివప్రసాద్, మధులు పట్టుబడగా, శ్రీకాంత్ పరారీ అయ్యాడు. అయితే వీరు కొంతకాలంగా ఛత్తీస్‌ఘడ్ నుంచి గంజాయి తీసుకొచ్చి, విద్యార్థులు, యువతకు చిన్న చిన్న ప్యాకెట్లుగా చేసి విక్రయిస్తున్నారని విచారణలో తేలిందన్నారు. అయితే గంజాయికి అలవాటుపడిన 20 మందిని గుర్తించి, వారికి కౌన్సిలింగ్ ఇచ్చినట్లు వివరించారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.18,625 ఉంటుందని, అరెస్టు చేసిన నిందితులను రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

లక్ష్మీనృసింహుడికి శతఘటాభిషేక పూజలు

● నిత్య ఆదాయం రూ.53.45లక్షలు ● 40వేల మంది భక్తుల రాక ● 14 నుంచి పవిత్రోత్సవాలు

భువనగిరి అర్బన్, ఆగస్టు 11: స్వామివారి జన్మనక్షత్రం రోజున స్వాతి నక్షత్రం పురస్కరించుకుని యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడి ఆలయంలో ఆలయంలో వేకువజామున అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించారు. సుప్రభాత సేవతో మేల్కొలిపిన అర్చకస్వాములు స్వయంభువులకు ఆస్థానపరంగా ఆరాధించి కవచమూర్తులకు హారతి నివేదించారు. ఆలయ ముఖమండపంలో 108 కలశాల్లో పంచామృతాలు, నవ ధాన్యాలు, దివ్య ఔషధాలతో నింపి వాటిపై కొబ్బరికాయలు పేర్చి పంచసూక్త పఠనాలతో హోమం చేపట్టారు. నిత్య కైంకర్యాలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. సుప్రభాత సేవతో స్వామి అమ్మవారిని మేల్కొలిపిన అర్చకస్వాములు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను అష్టభుజి ప్రాకార మండపంలో అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. గజవాహన సేవ చేపట్టి సాయంత్రం అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు చేశారు. పాతగుట్ట ఆలయంలోనూ నిత్య కైంకర్యాలు కొనసాగాయి.

తిరువీధుల్లో భక్తుల సందడి

ఇష్టదైవాలను దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు పెద్దసంఖ్యలో రావడంతో తిరువీధుల్లో సందడి నెలకొంది. సుమారు 40వేల మంది భక్తులు లక్ష్మీనృసింహుడిని దర్శించుకోగా, వీఐపీ టికెట్ దర్శనానికి గంట, ధర్మ దర్శనానికి రెండు గంటల సమయం పట్టింది. ఉభయ క్యూలైన్లు ఉదయం నుంచి రాత్రి వరకు భక్తజనులతో కిక్కిరిసిపోయాయి. ప్రధానాలయం, ప్రసాద విక్రయశాలల్లో మెట్ల దారిలో భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ ఉత్తర దిశలో భక్తులు అధిక సంఖ్యలో సేద తీరారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ అధికారులు తగినన్ని బస్సులు ఏర్పాటు చేశారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.53,45,736ల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు.



గంగాజల కలశంతో ప్రధానార్చకుడు లక్ష్మీనరసింహాచార్యులు

14 నుంచి పవిత్రోత్సవాలు

స్వామివారి ఆలయంతో పాటు పాతగుట్ట ఆలయంలో ఈ నెల 14 నుంచి 16వరకు మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు. ఆలయంలో నిత్య జరిగే కైంకర్యాల్లో జరిగిన దోషాల నివారణకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 15, 16వ తేదీల్లో రెండు రోజుల పాటు ఆర్జిత సేవలు రద్దు చేస్తున్నట్లు, తిరిగి ఈ నెల 17 నుంచి ఆర్జిత సేవలు పునః ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు.

ప్రణాళికతో చదివారు..

విజయ తీరాలకు చేరారు

● ఏఈఈలుగా ఎంపికైన నలుగురు లక్ష్మీదేవికాల్వ గ్రామస్థులు



లక్ష్మీదేవికాల్వ వ్యూ

మోత్కూరు, ఆగస్టు 11: యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలంలో లక్ష్మీదేవికాల్వ మారుమూల గ్రామం. అక్కడ 370 కుటుంబాలు ఉన్నాయి. వారంతా రైతులు, వ్యవసాయ కూలీలే. వారు నిత్యం రేయింబవళ్లు వ్యవసాయ పనులు చేస్తూ తమ పిల్లలను చదివిస్తున్నారు. ఆ గ్రామస్థులు తమ పిల్లలను కార్పొరేట్ పాఠశాలలకు, కళాశాలలకు పంపలేకపోయినా ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివి తమ ప్రతిభకు పదును పెట్టుకుంటున్నారు. రెక్కలు ముక్కలు చేసుకుని తమను చదివిస్తున్న తల్లిదండ్రుల కలలు పండిస్తూ కష్టపడి చదివి ఉన్నత ఉద్యోగాలు సాధిస్తున్నారు. ఇటీవల విడుదలైన ఏఈఈ ఫలితాల్లో గ్రామానికి చెందిన నలుగురు యువతీ, యువకులు ఉద్యోగాలు సాధించారు. ప్రణాళికతో చదవడమే తమ విజయానికి కారణమంటున్నారు.

● ఒకేసారి ఒకే గ్రామానికి చెందిన నలుగురు

ఏఈఈ ఫలితాల్లో లక్ష్మీదేవికాల్వ గ్రామానికి చెందిన రైతులు, కూలీల కుటుంబాలకు చెందిన ముగ్గురు యువకులు, ఓ యువతి ఉద్యోగాలు సాధించారు.



బండి విక్రమ్

● బండి విక్రమ్ తల్లిదండ్రులు నర్సింహస్వామిగౌడ్-మంగతాయిలది రైతు కుటుంబం. విక్రమ్ ప్రాథమిక విద్య గ్రామంలో, హైస్కూల్ విద్య అడ్డగూడూరు జడ్పీహెచ్ఎస్‌లో, ఇంటర్ సూర్యాపేట ప్రతిభ జూనియర్ కళాశాలలో, బీటెక్ ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో పూర్తిచేశాడు. ఏఈఈ ఫలితాల్లో రాష్ట్ర 11వ ర్యాంకు సాధించి నీటి పారుదల శాఖలో అగ్రికల్చర్ ఏఈఈగా ఉద్యోగం సాధించాడు.



దామెర మౌనిష్

● దామెర మౌనిష్ తల్లిదండ్రులు దుర్గాప్రసాద్-నాగలక్ష్మీలది నిరుపేద కుటుంబం. తండ్రి దుర్గాప్రసాద్ స్థానికంగా ఇస్త్రీ దుకాణం నడుపుతుండగా తల్లి నాగలక్ష్మి ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తోంది. మౌనిష్ 10వ తరగతి వరకు ఇమాంపేట మోడల్ స్కూల్లో, బీటెక్(సివిల్) బాసర ట్రిపుల్ ఐటీలో పూర్తిచేశాడు. మంచి ర్యాంకు సాధించి పంచాయతీరాజ్ శాఖలో ఏఈఈ ఉద్యోగం సాధించాడు.



ఓరు సంతోష్

● ఓరు యాదయ్య, ఎల్లమ్మ మట్టి(మేస్త్రి) పనులు చేస్తుంటారు. వారి కుమారుడు సంతోష్ 10వ తరగతి వరకు చలకుర్తి జవహర్ నవోదయలో, బీటెక్ బాసర ట్రిపుల్ ఐటీలో పూర్తి చేశాడు. ఏఈఈ ఫలితాల్లో మంచి ర్యాంకు సాధించి పీహెచ్ కోటాలో పబ్లిక్ హెల్త్ శాఖలో ఏఈఈ ఉద్యోగం సాధించాడు.



గ్రీష్మరాణి

● డాక్టర్ పొన్నాల సురేష్ సతీమణి గ్రీష్మరాణి కూడా మంచి ర్యాంకు సాధించి ఇరిగేషన్ అండ్ కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ శాఖలో ఏఈఈ ఉద్యోగం సాధించారు. గ్రామంలో ఒకేసారి నలుగురికి ఉద్యోగాలు రావడంపై గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామంలో ఇప్పటికే 60 మంది ప్రభుత్వ ఉద్యోగులు

గ్రామం చిన్నదే అయినా గ్రామ యువకులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదుగుతున్నారు. ఒక ప్రొఫెసర్, ఒకరు ఐఈఎస్, డాక్టర్‌గా ఉద్యోగాలు చేస్తుండగా, ప్రభుత్వ ఉపాధ్యాయులుగా, ఆర్మీలో, ఏఈవోలుగా, కార్యదర్శులుగా సుమారు 60మంది ప్రభుత్వ ఉద్యోగాలుగా పనిచేస్తున్నారు. డాక్టర్లుగా, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా, మెడికల్ విభాగాల్లో సుమారు 40 మంది ప్రైవేటు ఉద్యోగాలు చేస్తున్నారు. కంచుగట్ల పెద్ద వీరయ్య ఇంటిలో అందరూ(ముగ్గురు కుమారులు, కుమార్తె) ఉద్యోగస్తులే. లక్ష్మీదేవికాల్వ గ్రామంలో ప్రతీ కుటుంబం కష్టపడి పనిచేస్తూ ఆర్థికంగా ఎదగడంతోపాటు తమ పిల్లలను చదివించి ఉన్నత స్థాయికి చేర్చుతూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారడంలో సందేహం లేదు.

తొండవాసికి నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు



గొలుసుల వెంకటేష్

తిరుమలగిరి రూరల్ : తల్లిదండ్రులు కూలీనాలి చేస్తుండటాన్ని గమనించిన సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం తొండ గ్రామానికి చెందిన గొలుసుల వెంకటేష్ కష్టపడి చదివి నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి నేటి యువతకు ఆదర్శంగా నిలిచారు. ఇందులో రెండు గెజిటెడ్ స్థాయి ఉద్యోగాలు కావడం గమనార్హం. ఇటీవల టీఎస్‌పీఎస్సీ ప్రకటించిన ఫలితాల్లోనూ మార్కులు సాధించి నీటిపారుదల శాఖలో ఏఈఈగా ఉద్యోగం సాధించారు. గతంలో పాలిటెక్నిక్ లెక్చరర్, అసిస్టెంట్ ఇంజనీర్, గ్రూప్- 4 ఉద్యోగాలకు ఎంపికైనప్పటికీ ఏఈఈగా చేయాలన్న తలంపుతో మూడు ఉద్యోగాలను వదిలేశారు. ఓ వైపు ప్రభుత్వ ఉద్యోగ నియామక పోటీ పరీక్షలకోసం చదువుతూనే వివిధ ప్రైవేట్ సంస్థల్లో సివిల్ సైట్ ఇంజనీర్‌గా పనిచేస్తూ, నీటి పారుదలశాఖలో కొలువు సాధించి అందులో చేరారు. వెంకటేష్ తిరుమలగిరి మండల కేంద్రంలోని శ్రీవాణి విద్యామందిర్‌లో ప్రాథమిక విద్య, అదేవిధంగా తిరుమలగిరిలో 10వ తరగతి వరకు, బీటెక్, ఎంటెక్ మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో విద్యనభ్యసించారు. తల్లి వసంత, తండ్రి కొండయ్యలు పేదరికంలో ఉండి సైతం తమ కుమారుడిని ఉన్నత చదువులు చదివించారు. తమ కుమారుడు ఉద్యోగం సాధించడంపై తల్లిదండ్రులు, గ్రామస్థులు వెంకటేష్‌ను అభినందించారు.

ఐదు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపిక



రమావత్ రాందాసు

పెద్దఅడిశర్లపల్లి: నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలం చింతల్‌తండా గ్రామానికి చెందిన రమావత్ రాందాసు ఐదు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి యువతకు ఆదర్శంగా నిలిచారు. 2020లో ఎస్ఎస్‌సీ మల్టీ టాస్కింగ్ స్టాఫ్ ఉద్యోగం(ముంబయిలో), 2021లో ఎస్ఎస్‌సీ మల్టీ టాస్కింగ్ స్టాఫ్ ఉద్యోగం(హైదరాబాద్‌లో), 2022లో కంబైండ్ గ్రాడ్యుయేషన్ లెవెల్‌లో పోస్టల్ డిపార్ట్‌మెంట్, 2023 అసిస్టెంట్ కమ్యూనికేషన్ ఆఫీసర్ కేంద్ర హోంశాఖలో ఉద్యోగం సాధించారు. ప్రస్తుతం ఆదాయపు పన్నుశాఖ బెంగళూరులో అకౌంటెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. రమావత్ రాందాసు 10వ తరగతి వరకు మిర్యాలగూడ, ఇంటర్ హైదరాబాద్, బీటెక్ వెస్ట్ బెంగాల్‌లో పూర్తిచేశారు. తల్లిదండ్రులు భక్యానాయక్, శాంతి, గ్రామపెద్దలు రాందాసును అభినందించారు.

మూఢ నమ్మకాలను విడనాడాలి: జేవీవీ


అవగాహన కల్పిస్తున్న జేవీవీ, ప్రజా సంఘాల నాయకులు

మిర్యాలగూడ, ఆగస్టు 11: ప్రజలు మూఢ నమ్మకాలను విడనాడాలని జన విజ్ఞాన వేదిక నాయకులు కోలా శ్రీనివాస్, పాదూరి రమణారెడ్డి, సైన్స్ ప్రచార సంస్థ బక్క శ్రీనివాసచారి అన్నారు. పట్టణంలో ఓ రెసిడెన్షియల్ కాలనీలో ఆదివారం అమావాస్య రోజున గుర్తు తెలియని వ్యక్తులు వేప చెట్టు కింద కొబ్బరికాయలు వేశారు. దీంతో అవి క్షుద్ర పూజలు చేసి మంత్రించిన కొబ్బరికాయలుగా ప్రచారం జరగడంతో కాలనీవాసులు భయాందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న జన విజ్ఞాన వేదిక నాయకులు ప్రజాసంఘాల నేతలతో కలిసి వెళ్లి ఆ కొబ్బరికాయలను పగులగొట్టి అక్కడే తిన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి చర్యలపై ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. చేతబడులు, మంత్రతంత్రాల పేరుతో ప్రజల్లో అభద్రతాభావం పెంపొందించి సర్వస్వం దోచుకోవడానికి యత్నిస్తారని అన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల జేఏసీ కన్వీనర్ బీసం రామయ్య, జేవీవీ జిల్లా మాజీ అధ్యక్షుడు గుత్తికొండ సుదర్శన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అమరయ్య, శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయ సంఘం నేతలు ఉదయకుమారి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

'మధ్యాహ్న' పథకాన్ని ప్రైవేట్ సంస్థలకు ఇవ్వవద్దు

కట్టంగూరు, ఆగస్టు 11: మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేట్ సంస్థలకు అప్పగించవద్దని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు పెంజర్ల సైదులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన మధ్యాహ్న భోజన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మధ్యాహ్న కార్మికులకు కార్మికులకు రెండు నెలల నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వారికి ఇస్తామన్న వేతనాలు రూ.3 వేలు కూడా సక్రమంగా ఇవ్వడం లేదని ఆరోపించారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 21న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు మాచర్ల యాదమ్మ, కంకణాల శోభరాణి, సభ్యులు కొప్పు మంగమ్మ, మాతంగి లక్ష్మమ్మ, రేణుక, విజయమ్మ, ప్రమీల, నరసమ్మ పాల్గొన్నారు.

పొదుపు, రుణ అవకాశాలను వినియోగించుకోవాలి

హాలియా, ఆగస్టు 11: ప్రజలు లోన్‌యాప్స్, ప్రైవేట్ ఫైనాన్స్‌లను, వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి నష్టపోవద్దని, గవర్నమెంట్ ద్వారా గుర్తింపు పొందిన మాక్స్ సొసైటీలో సభ్యత్వం తీసుకొని పొదుపు రుణ అవకాశాలను వినియోగించుకోవాలని తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ హైదరాబాద్ ప్రిన్సిపాల్ డాక్టర్ భూక్యా వెంకన్న అన్నారు. హాలియాలో శ్రీ కృష్ణ మ్యూచువల్ ఎయిడెడ్ థ్రిఫ్ట్, క్రెడిట్ కోపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ఫినో బ్యాంకును ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. వ్యాపార అభివృద్ధి, మానవ వనరుల సమీకరణ, ఫైనాన్స్ బ్యాంకులతో పోటీగా ఎదగడం, భవిష్యత్తులో బ్రాంచ్‌ల విస్తరణతో పాటు ఉద్యోగులు ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫినో పేమెంట్ బ్యాంక్ తెలంగాణ రీజనల్ హెడ్ ఎస్.కె. అబ్దుల్ హమీద్, సొసైటీ మేనేజింగ్ డైరెక్టర్ సోమనబోయిన శ్రీశైలంయాదవ్, డైరెక్టర్ భూతం చంద్రశేఖర్, మేనేజర్, సొసైటీ సిబ్బంది, సభ్యులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా కంఠమహేశ్వరస్వామి కల్యాణం

కేతేపల్లి, ఆగస్టు 11: గీత కార్మికుల ఆరాధ్య దైవమైన శ్రీకంఠమహేశ్వర స్వామి కల్యాణ వేడుకలను మండలంలోని కొండకిందిగూడెం గ్రామంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు కంఠ మహేశ్వరస్వామికి బోనాలు సమర్పించి మొక్కుకున్నారు. కార్యక్రమానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ గోలి మంజులవేణుమాధవరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, నాయకులు కె.ప్రదీప్‌రెడ్డి, బి.మహేందర్, యాదగిరి పాల్గొన్నారు.

కాల్వ పూడికతీతతో చివరి భూములకు సాగునీరు

తిరుమలగిరి(సాగర్), ఆగస్టు 11: డి-8,9 లిఫ్ట్ కాల్వను కాల్వలో పూడికతీత పనులు చేపట్టడం హర్షనీయమని యువజన కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు మెరావత్ మునినాయక్ అన్నారు. మండలంలోని కుంకుడుచెట్టుతండా వద్ద డి-8,9 లిఫ్ట్ కాల్వను ఆయన పరిశీలించి మాట్లాడారు. కాల్వలో పూడిక, పిచ్చిచెట్లను తొలగించడానికి ప్రభుత్వం రూ.40లక్షలను విడుదల చేయడంపై గాత్‌తండా, తూటిపేతండా, ఎల్లాపురం తండా గ్రామ గిరిజన రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. వరదకాల్వ ద్వారా 130 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నందున నీరు చివరి భూములకు, ఆరు తడి పంటలకు నీరు అందుతుందన్నారు. కాల్వలో పూడికతీత పనులు చేపట్టేందుకు కృషి చేసిన మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దేపావత్ శివాజీనాయక్, కొర్ర శంకర్‌నాయక్, దండు భిక్షం, రాజునాయక్, రైతులు హట్టినాయక్, చత్రునాయక్, బాబునాయక్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయులను స్మరించుకోవటం మన బాధ్యత

కనగల్, ఆగస్టు 11: మహనీయులను సమ్మరించుకోవటం ప్రతి ఒక్కరి బాధ్యత అని బీజేపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పులకరం బిక్షం, దాసరి వెంకన్న అన్నారు. బీజేపీ హర్‌ఘర్ తిరంగా జెండాలో భాగంగా ఆదివారం కనగల్ ఎక్స్‌రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహానికి నాయకులు నీటితో కడిగి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పంతంగి సైదులు, ఏడుకొండలు, సురేష్, రమేష్ సైదులు, యాదగిరి, లింగయ్య పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నివారణపై నేడు ర్యాలీ

నల్లగొండ టౌన్, ఆగస్టు 11: మాదకద్రవ్యాల నివారణపై సోమవారం పట్టణంలోని ఎన్జీ కళాశాల నుంచి క్లాక్‌టవర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సంతోష్‌కుమార్ తెలిపారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రరిమాణాలు, యువతను ఎలా కాపాడుకోవాలో క్లాక్‌టవర్ సెంటర్లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రతీ ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

వయనాడ్ బాధితులను ఆదుకోవాలి : సీఐటీయూ

హాలియా, ఆగస్టు 11: కేరళలోని వయనాడ్ వరద బాధితులకు మానవతా దృక్పథంతో ప్రతిఒక్కరూ స్పందించి ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అవుతా సైదులు అన్నారు. హాలియాలో ఆదివారం వరద బాధితుల కోసం విరాళాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం తక్షణమే ఆదుకోవాల్సింది పోయి ప్రకృతి వైపరీత్యాలను కూడా రాజకీయం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే యుద్ధప్రాతిపదికన కేరళ ప్రభుత్వాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. హాలియాలో రూ. 3,727 సేకరించి జిల్లా కమిటీకి పంపించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు నల్లబెల్లి జగదీష్, రమేష్, సీఐటీయూ నాయకులు పొదిల వెంకన్న, లక్ష్మమ్మ, వెంకటమ్మ, నారమ్మ, సాయి, హర్షిత్, శివ పాల్గొన్నారు.

పంద్రాగస్టుకు పచ్చగా.. పరిశుభ్రంగా..

» లక్ష మొక్కలు నాటేందుకు ప్రణాళిక

» ప్లాస్టిక్ నిషేధానికి ప్రతిజ్ఞ


పట్టణంలో డ్రైనేజీ శుభ్రం చేస్తున్న దృశ్యం (ఫైల్)

పంద్రాగస్టుకు పట్టణం పచ్చగా.. పరిశుభ్రంగా మారనుంది. పట్టణాన్ని చెత్త, ప్లాస్టిక్ రహితంగా మార్చడం తో పాటు నియోజకవర్గంలో గంజాయి గింజ లేకుండా చేయాలన్న దృఢ సంకల్పంతో అడుగులేస్తున్నారు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి. పట్టణంలోని 48 వార్డుల్లో వ్యర్థాలను తొలగించడంతో పాటు చెత్తరహితంగా చేయాలని సంకల్పించారు. నేను- నా మిర్యాలగూడ నినాదంతో ఇప్పటికే ఆయా వార్డుల్లో అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులతో పరిశుభ్రత కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇక పట్టణాన్ని పచ్చని హారంలా చేసేందుకు లక్ష మొక్కలు నాటే దిశగా చర్యలు చేపట్టారు పాలకులు. రైస్‌మిల్లర్ల సంఘానికి 25 వేల మొక్కలు నాటి సంరక్షించే బాధ్యతను అప్పగించారు.

-(మిర్యాలగూడ టౌన్)

మిర్యాలగూడ పట్టణంపై ఎమ్మెల్యే బీఎల్ఆర్ ప్రత్యేక దృష్టి సారించారు. మునిసిపల్ కార్యాలయాన్ని సరికొత్తగా తీర్చిదిద్దేందుకు కంకణబద్ధులై అక్కడి అధికారులతో పాటు ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదంటూ అధికారులు ఉద్యోగులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పారిశుధ్య కార్మికులతో సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే పచ్చదనం-పరిశుభ్రత కార్యక్రమంలో వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. పట్టణాన్ని పరిశుభ్రంగా మార్చేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులతో పాటు రైస్‌మిల్లర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమావేశమవుతున్నారు. డంపింగ్ యార్డును పరిశీలించారు.

100 అడుగుల జాతీయ జెండా ఏర్పాటు

పట్టణంలోని ఎన్నెస్పీ క్యాంపు రాజీవ్ క్రీడా మైదానంలో 100 అడుగుల జాతీయ జెండాను ఏర్పాటు చేస్తున్నారు. నేను- నా మిర్యాలగూడ నినాదంతో ఐక్యత, జాతీయతకు ప్రతీకగా వంద అడుగుల స్థూపంపై త్రివర్ణ పతాకం ఎగరవేయనున్నారు.

రాష్ట్రమంతా నియోజకవర్గం వైపు చూడాలి



నియోజకవర్గాన్ని పచ్చగా, పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నాం. అంతేకాక నియోజకవర్గాన్ని చెత్త, ప్లాస్టిక్, గంజాయి రహితంగా చేయాలన్న సంకల్పంతో పనిచేస్తున్నాం. రాష్ట్రంలోని 118 నియోజకవర్గాలు మిర్యాలగూడ వైపు చూసేలా అభివృద్ధి చేయాలన్నది నా ఆకాంక్ష. అందుకే నియోజకవర్గ కేంద్రంపై ప్రత్యేక దృష్టి సారించా. ప్రభుత్వ కార్యాలయాల పనితీరును మారుస్తాం.

- బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే

అందరూ సహకరించాలి



పట్టణాన్ని పచ్చగా, పరిశుభ్రంగా మార్చేందుకు ప్రజలందరి సహకారం అవసరం. నిషేధిత ప్లాస్టిక్‌ను బహిష్కరించి పట్టణాన్ని ప్లాస్టిక్ రహితంగా చేయాలి. తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందించాలి. వ్యర్థాలను ఖాళీ ప్రదేశాల్లో, మురుగు కాల్వలో వేయరాదు. పట్టణంలోని రహదారులతో పాటు ఖాళీ ప్రాంతాల్లో విరివిగా మొక్కలు నాటేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం.

- తిరునగరు భార్గవ్, మునిసిపల్ చైర్మన్

చెట్లతోనే జీవరాశి మనుగడ సాధ్యం

కలెక్టర్ నారాయణరెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ రూరల్: చెట్లతోనే సమస్త జీవరాశి మనుగడ సాధ్యమని కలెక్టర్ నారాయణరెడ్డి, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని ఆలగడప ఈద్గా వద్ద ముస్లిం, మైనార్టీలు, మత గురువులతో కలిసి 2 వేల మొక్కలను నాటే కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మొక్కలను నాటి మాట్లాడారు. భవిష్యత్తు తరాలవారు ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని గడపాలంటే ప్రస్తుతం మనం మొక్కలను నాటి వాటిని పరిరక్షించాలన్నారు. పర్యావరణ సమతుల్యత మొక్కల వల్లే సాధ్యమని, అందువల్ల ప్రతి పౌరుడు కుల, మతాలకు, రాజకీయాలకతీతంగా విధిగా మొక్కలను నాటి సంరక్షించాలని సూచించారు. రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 25 వేల మొక్కలు, ముస్లిం సోదరులు 2 వేల మొక్కలను నాటేందుకు ముందుకు వచ్చారని, అదేవిధంగా డాక్టర్లు కూడా తమ వంతుగా మొక్కలను నాటుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.


ఆలగడప ఈద్గా వద్ద మొక్కలను నాటుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

వైభవంగా శ్రావణమాసం బోనాలు

నల్లగొండ కల్చరల్, కేతేపల్లి, ఆగస్టు 11: శ్రావణమాసం సందర్భంగా పట్టణంలోని ముత్యాలమ్మతల్లి దేవాలయాల్లో బోనాల మహోత్సవాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పసుపు, కుంకుమలతో అందంగా అలంకరించిన బోనాలను నెత్తిన పెట్టుకుని ప్రదర్శనగా ఊరేగింపుగా దేవాలయానికి చేరుకున్నారు. బోనాల నైవేద్యాన్ని అమ్మవారికి సమర్పించి మొక్కులు మొక్కుకున్నారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి చీర, సారెలతో పాటు మొక్కులు తీర్చుకున్నారు.

● నల్లగొండ పట్టణంలోని రామగిరిలో ముత్యాలమ్మ దేవాలయం, గొల్లగూడెం, మర్రిగూడలోని రేణుకా ఎల్లమ్మ తల్లి దేవాలయాల్లో బోనాల మహోత్సవం వైభవంగా జరిగింది. చుట్టుపక్కల కాలనీలు, వివిధ వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో బోనాలు తీసుకువచ్చారు. అమ్మవారికి మొక్కులు చెల్లించి చల్లగా చూడాలని పూజించారు. దీంతో ఆయా దేవాలయాల ప్రాంగణాలు భక్తులతో సందడిగా మారాయి. అంతకుముందే అర్చకస్వాములు అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించి శాస్త్రోక్తంగా అభిషేకాలు, పూజలు చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కూడా అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు.


నల్లగొండలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు


కొత్తపేటలో బోనాలతో ముత్యాలమ్మ గుడి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు

● కేతేపల్లి మండలంలోని కొత్తపేట గ్రామంలో ముత్యాలమ్మ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రైతులు తమ ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లను అమ్మవారి గుడి చుట్టూ తిప్పి ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు బాగుండాలని మొక్కుకున్నారు. వేడుకల్లో వివిధ పార్టీలకు చెందిన నాయకులు బి.యాదవరెడ్డి, పి.సుధాకర్‌రెడ్డి, బి.జానకిరాములు, కె.మల్లేష్, ఆర్.సైదులుగౌడ్, బి.వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


నల్లగొండలో నిర్వహించిన సమ్మేళనంలో పాల్గొన్న శ్రీ శారద విద్యామందిర్ విద్యార్థులు


చింతపల్లిలో సమ్మేళనంలో పాల్గొన్న టీచర్లు, విద్యార్థులు

నల్లగొండరూరల్, చింతపల్లి, ఆగస్టు 11: ఆహ్లాదంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. ఆదివారం జిల్లా కేంద్రంతో పాటు చింతపల్లిలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు విద్య అభ్యసించిన పాఠశాలలో కలుసుకొని గత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అదే విధంగా వారికి విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి సన్మానించారు. ప్రతీ ఒక్కరి జీవితంలో ఉపాధ్యాయుల పాత్ర, చిన్ననాటి స్నేహితుల యొక్క విలువైన స్నేహం గురించి చర్చించుకున్నారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తు తెచ్చుకొని సంతోషం వ్యక్తం చేశారు.

● నల్లగొండ పట్టణంలోని శ్రీశారద విద్యా మందిర్ హైస్కూల్‌లో 2000-2001 సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. సుమారు 24 సంవత్సరాల తర్వాత వారు కలుసుకొని స్నేహితుల బాగోగులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అప్పటి హెచ్ఎం, టీచర్లు, విద్యార్థులు ఔరోజు వెంకన్న, సోమన్న, వెంకటేశ్వర్లు, శ్రీకాంత్, చందు, ప్రశాంత్, జాని తదితరులు పాల్గొన్నారు.

● చింతపల్లి మండలంలోని వెంకటేశ్వరనగర్ జడ్పీహెచ్ఎస్‌కు చెందిన 2007-08 పదో తరగతి విద్యార్థులు కలుసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎండి.అన్వర్, రేణుక, అంగిరేకుల రాజు, విద్యార్థులు పోలగోని బాల్‌రాజ్, శ్రీను, ప్రదీప్, వెంకటేష్, దేవి, సువర్ణ, లావణ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొండమల్లేపల్లి, ఆగస్టు 11: కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఒకరు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. పోలీసుల వివరాల ప్రకారం.. చందంపేట మండలం పోలేపల్లి గ్రామానికి చెందిన నాగిళ్ల నాగరాజు(35) సెంట్రింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం హైదరాబాద్ వెళ్లేందుకు స్వగ్రామం నుంచి కొండమల్లేపల్లికి వచ్చాడు. బస్టాండు ఎదుట రోడ్డు దాటుతుండగా, నాగార్జునసాగర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న గుర్తు తెలియని ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. నాగరాజు తండ్రి సాయిలు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు హెడ్ కానిస్టేబుల్ జగన్ తెలిపారు.

విజయోత్సవ సభను విజయవంతం చేయాలి

నల్లగొండ టౌన్, ఆగస్టు 11: ఎస్సీ వర్గీకరణ తర్వాత 13వ తేదీన హైదరాబాద్‌కి వస్తున్న మందకృష్ణమాదిగకు ఘనస్వాగతం పలుకుతూ నిర్వహించనున్న విజయోత్సవ ర్యాలీకి మాదిగలు, అనుబంధ కులాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు మామిడి సైదులు, ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇరిగి శ్రీశైలం, ఎంఈఎఫ్ రాష్ట్ర నాయకుడు మల్లెపాక వెంకన్న, జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గాదె రమేష్ తెలిపారు. జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశాల్లో వారు పాల్గొని మాట్లాడారు. ఈ నెల 1న సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణపై చరిత్రాత్మక తీర్పు ఎమ్మార్పీఎస్ 30 సంవత్సరాల పోరాటానికి దక్కిన ఫలితమని పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న భారీ ర్యాలీని జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ ర్యాలీలో ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు దక్షిణాది రాష్ట్రాల నుంచి కూడా ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు, మాదిగ సామాజిక వర్గానికి చెందిన ప్రజలు, అభిమానులు శ్రేయోభిలాషులు పాల్గొననున్నట్లు తెలిపారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి సహకరించిన నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఈ ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశాల్లో నాయకులు లంకపల్లి నగేష్, గట్టు మల్లయ్య, కందుల మోహన్, బొజ్జ దేవయ్య, కత్తుల సందీప్, మాసారం వెంకన్న, బొజ్జ నాగరాజు, రణవీర్, బకరం పరమేష్, బుర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి


నాగరాజును సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

మిర్యాలగూడ టౌన్, మిర్యాలగూడ అర్బన్, ఆగస్టు 11: గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాధినేని శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన మోర్చాల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతీ ఒక్కరికి దక్కేలా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సేవలందించేందుకే పార్టీ అధిష్ఠానం విభాగాలు ఏర్పాటు చేసిందన్నారు. అన్ని విభాగాలు సమష్టిగా పనిచేసి రానున్న పంచాయతీ, మునిసిపల్ ఎన్నికల్లో పార్టీకి ఘన విజయం అందించాలన్నారు. అనంతరం బీజేపీ దళితమోర్చా జిల్లా కార్యదర్శిగా ఎంపికైన ఉబ్బపల్లి నాగరాజు ఘనంగా సన్మానించారు. సమావేశంలో మహిళ, ఓబీసీ, దళితమోర్చాల నాయకులు మదన్‌మోహన్, రేపాల పురుషోత్తంరెడ్డి, శేఖర్, సరిత, సత్యప్రసాద్, హన్మంతరెడ్డి, శ్యామ్, అజయ్, శ్రీనివాస్‌రెడ్డి, భిక్షం, సోములు తదితరులు పాల్గొన్నారు.

ఏఎమ్మార్పీ నీటి విడుదలపై ప్రచారాలు నమ్మొద్దు


చెక్కులను పంపిణీ చేస్తున్న శ్రీనివాస్‌గౌడ్, అనూప్‌రెడ్డి


కనగల్, ఆగస్టు 11: ఏఎమ్మార్పీ కాల్వ నీటి విడుదలపై అసత్య ప్రచారాలను నమ్మవద్దని మాజీ జడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం అనూప్‌రెడ్డి అన్నారు. కనగల్ మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ప్రభుత్వం మంజూరు చేసిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆదివారం వారు లబ్ధిదారులకు అందజేసి మాట్లాడారు. ఏఎమ్మార్పీ కాల్వకు సంబంధించి నాలుగు మోటార్లు ఉండగా బీఆర్ఎస్ హయాంలో రెండు మోటార్లు చెడిపోయినట్లు తెలిపారు. రెండు మోటార్లలో ఓ మోటార్ ద్వారా హైదరాబాద్ తాగునీటి అవసరాలకు మరో మెటార్ ద్వారా ఏఎమ్మార్పీ కాల్వకు అధికారులు నీటిని విడుదల చేస్తున్నారని అన్నారు. అయితే ఒక్క మోటార్ ద్వారా వచ్చే నీళ్లు చెరువు, కుంటలకు నింపేందుకు సరిపోవటం లేదన్నారు. ఈ క్రమంలో రైతులను రెచ్చగొట్టేందుకు పలువురు తప్పుడు ప్రచారం చేస్తుండటం దురదృష్టకరమన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదేశాలతో అధికారులు మోటార్ల మరమ్మతు చేపట్టి సమస్యను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. మండల పరిధిలోని డిస్ట్రీబ్యూటరీ కాల్వకు మంత్రి రూ.40లక్షలు సొంత నిధులతో మరమ్మతుల పనులు చేయించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు నర్సింగ్ సునీతకృష్ణయ్యగౌడ్, గోగు యాద య్య, మాజీ కోఆప్షన్ హఫీజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం...

హాలియా: హాలియా సబ్‌స్టేషన్‌లో అనుముల ఫీడర్ బ్రేకర్ మార్పిడి ఉన్నందున సోమవారం ఉదయం 10 నుంచి 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు హాలియా విద్యుత్ ఏఈ బాలు తెలిపారు. అనుముల ఫీడర్ కింద అనుముల, అనుములవారిగూడెం, ఈశ్వర్‌నగర్ గ్రామాలకు సప్లై నిలిపివేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ గృహ, వాణిజ్య, వినియోగదారులు, రైతులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

కొండమల్లేపల్లి: కొండమలేపల్లి మండల పరిధిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఒక సహాయ వంట మనిషి పోస్టుకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో మాతృనాయక్ తెలిపారు. 7వ తరగతి పాసై ఉండి మల్లేపల్లి మండలానికి చెందిన స్థానికులైన వారికి, అనుభవం కలిగి ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వనున్న ట్లు తెలిపారు. వివరాలకు 8074490842 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

హాలియా: వివిధ కారణాలతో చదువు మధ్యలో మానేసిన వారి కోసం తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ అధ్వర్యంలో నిర్వహించే ఓపెన్ టెన్త్, ఇంటర్‌లకు అడ్మిషన్లు ప్రారంభమైనట్లు హాలియా ప్రభుత్వ ఉన్నత పాఠశాల కోఆర్డినేటర్ గుండా కృష్ణమూర్తి తెలిపారు. మిగతా వివరాలకు 9010750686 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.


అశోక్‌గౌడ్

శాలిగౌరారం: మండలంలోని బాలిశెట్టిగూడెంలో జనచైతన్య యువజన సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కుంభం అశోక్‌గౌడ్, ఉపాధ్యక్షుడు అదె ఉపేందర్, ప్రధాన కార్యదర్శి వాడపల్లి శేఖర్, కోశాధికారి చిల్లంశెట్టి సాయిగణేష్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మిర్యాలగూడ టౌన్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఎ స్టీయూ జిల్లా అధ్యక్షుడు కొనకంచి వీరరాఘవులు కోరారు. హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రెస్ అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డికి తమ సమస్యలు విన్నవించి పరిష్కారానికి ప్రభుత్వానికి సిఫారసు చేయాలని కోరినట్లు తెలిపారు. ఆయన వెంట నాయకులు బంధం వెంకటేశ్వర్లు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండ: తెలంగాణ వ్యవసాయ కార్మికసంఘం దేవరకొండ నియోజకవర్గ కమిటీని ఎన్నుకున్నారు. వ్యకాస నియోజకవర్గ అధ్యక్షుడిగా మొగిలి వెంగలయ్య, ఉపాధ్యక్షుల గంగిలి పుల్లయ్య, కూన వెంకటయ్య, కొలుకుల కృష్ణయ్య, ప్రధానకార్యదర్శి ఎలిమినేటి హుస్సేన్ కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఎన్నికకు సహకరించిన సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి బొలుగురి నర్సింహకు కృతజ్ఞతలు తెలిపారు.

తిరుమలగిరి(సాగర్): మండలంలో సుదీర్ఘకాలంగా పనిచేసి ఇటీవల కాలంలో జరిగిన బదిలీలు, పదోన్నతుల్లో ఇతర మండలాలకు వెళ్లిన టీఎస్‌యూటీఎఫ్ నాయకులను ఘనంగా సన్మానించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశం మాట్లాడుతూ ఇటీవల జరిగిన బదిలీలు, పదోన్నతులు టీఎస్ యూటీఎఫ్ చేసిన పోరాట ఫలితమేనని అన్నారు. అనంతరం బదిలీలు, పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు మండలశాఖ ఆధ్వర్యంలో శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో వి.రాజు, ఎరనాగుల సైదులు, శ్రీదేవి, శ్రీనివాస్‌రెడ్డి, సరోజినిదేవి, బివి.రావు, సైదయ్య, రమణ, మోతీలాల్, కృష్ణ, ప్రశాంత్, సైదయ్య పాల్గొన్నారు.

మునుగోడురూరల్: మునుగోడు మండలం గుండ్లోరిగూడెం గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన ఈర్ల నర్సమ్మ(65) అనారోగ్యంతో మృతి చెందారు. మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు వట్టికోటి శేఖర్ ఒక క్వింటాల్ బియ్యం, రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, యువజన కాంగ్రెస్ నాయకులు జంగిలి నాగరాజు, జాజుల వెంకటేష్, కర్నాటి వెంకటేశం, మహేష్, శ్రీను, మహేష్, మారేష్, పరశురాం పాల్గొన్నారు.

గుర్రంపోడు: మండలంలోని పిట్టలగూడెం గ్రామంలో గల మైనార్టీ బాలుర జూనియర్ కళాశాలలో పీఈటీగా పనిచేస్తూ గుండెపోతులో మృతి చెందిన షేక్ జావిద్ కుటుంబ సభ్యులకు రూ.1.90 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. నల్లగొండ జిల్లా ఆర్ఎల్ విష్ణుమూర్తి, ప్రిన్సిపాల్ మహమ్మద్ ఫారూక్, పీఈటీల సహకారంతో రాష్ట్రంలోని మైనార్టీ గురుకులాల్లో పనిచేసే అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, కళాశాల సిబ్బంది, తెలంగాణ పీఈటీల సంఘం ఆధ్వర్యంలో ఈ మొత్తాన్ని సేకరించారు. ఆదివారం ఆర్ఎల్ విష్ణుమూర్తి, ప్రిన్సిపాల్ మహమ్మద్ ఫారుక్‌లు జావిద్ కుటుంబ సభ్యులను పరామర్శించి భార్య కౌసర్‌కు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ వార్డెన్ షేక్ సయ్యద్ మియా, పీఈటీ కోటేష్, పరమేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.


చెక్కును అందజేస్తున్న ఆర్ఎల్ విష్ణుమూర్తి

విద్యుత్ కార్మికుడికి తప్పిన ప్రాణాపాయం

కనగల్, ఆగస్టు 11: విద్యుత్ లైన్ సరిచేస్తున్న క్రమంలో ఓ కాంట్రాక్ట్ విద్యుత్ కార్మికుడు విద్యుదాఘాతానికి గురయ్యాడు. తోటి కార్మికుడు సమయస్ఫూర్తిని ప్రదర్శించటంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కనగల్ ఎక్స్‌రోడ్డులో ఆదివారం ఉదయం లైన్‌మన్ యాదగిరిరావు ఆధ్వర్యంలో విద్యుత్ లైన్ సరిచేస్తున్నారు. బచ్చన్నగూడెం గ్రామానికి చెందిన కాంట్రాక్ట్ కార్మికుడు మన్నెం వెంకన్న స్తంభంపైకి ఎక్కి విద్యుత్‌వైర్లను సరిచేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురైయ్యాడు. ఇది గమనించిన తోటి కార్మికుడు కట్ట రాంకుమార్ అతని చొక్కాను పట్టుకుని లాగి విద్యుదాఘాతం నుంచి రక్షించి ప్రాణాలను కాపాడారు. వెంకన్న చేతులకు స్వల్ప గాయాలు కాగా చికిత్స కోసం మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.